సాక్షి
అనంతపురం
శనివారం ၊ 27 ၊ సెప్టెంబర్ ၊ 2025



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీ టన్ను గరిష్ట ధర రూ.18 వేలు, కనిష్టం రూ.10 వేలు చొప్పున విక్రయాలు జరిగాయి.



టమాట కిలో రూ.18

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18, కనిష్టం రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
32.8°/21.2°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి నుంచి పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కి.మీ. వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నిషేధిత భూములపై ప్రత్యేక డ్రైవ్



నిషేధిత భూముల ఫైళ్లను పరిశీలిస్తున్న 31 మండలాల రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం అర్బన్‌: నిషేధిత భూముల (22ఎ) ఫైళ్ల పరిష్కారానికి కలెక్టర్‌ ఆనంద్‌ చర్యలు చేపట్టారు. 'సాక్షి'లో ఈనెల 17న ప్రచురితమైన ''సారూ... దృష్టిపెట్టండి'' కథనానికి ఆయన స్పందించారు. కలెక్టర్‌ ఆదేశాల మేరకు మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 32 మండలాలకు చెందిన ఫైళ్ల పరిశీలన ప్రక్రియ కలెక్టరేట్‌ రెవెన్యూ భవన్‌లో మండల తహసీల్దార్లు, డీటీలు, ఆర్‌ఐలు చేపట్టారు. ఈ ప్రక్రియను జాయింట్‌ కలెక్టర్‌ శివ్‌ నారాయణ్‌ శర్మ, డీఆర్‌ఓ మలోల పర్యవేక్షించారు. 32 మండలాల పరిధిలో 2024 జూన్‌ 15 తరువాత అందిన ఫైళ్లలో ప్రస్తుతం మొదటిదశగా 487 ఫైళ్ల పరిశీలన నిర్వహిస్తున్నారు.

కాలేజీలకు రేపటి నుంచి దసరా సెలవులు

అనంతపురం ఎడ్యుకేషన్‌: అన్ని యాజమాన్యాల జూనియర్‌ కళాశాలలకు ఆదివారం నుంచి అక్టోబరు 5 వరకు దసరా పండుగ సెలవులను ఇంటర్‌ బోర్డు ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రైవేట్‌ జూనియర్‌ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇంటర్‌ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణనాయక్‌ శుక్రవారం తెలిపారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించి తరగతులు నిర్వహిస్తున్నట్లుగా తమ దృష్టికి వస్తే నిబంధనల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యా వ్యవస్థలో క్రమశిక్షణను, విద్యార్థుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లాకు 1,586 మెట్రిక్‌ టన్నుల యూరియా




యూరియాను పరిశీలిస్తున్న ఏడీఏ

అనంతపురం అగ్రికల్చర్‌: నర్మదా కంపెనీ నుంచి 1,585.85 మెట్రిక్‌ టన్నుల యూరియా శుక్రవారం జిల్లాకు చేరినట్లు రేక్‌ ఆఫీసర్‌, ఏడీఏ అల్తాఫ్‌ అలీఖాన్‌ తెలిపారు. ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌ రేక్‌పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా సరఫరా అయిన యూరియా లాట్లను ఆయన పరిశీలించారు. జాయింట్‌ కలెక్టర్‌ ఆదేశాల మేరకు వచ్చిన దాంట్లో 1,020 మెట్రిక్‌ టన్నులు మార్క్‌ఫెడ్‌కు, 565.85 మెట్రిక్‌ టన్నులు ప్రైవేట్‌ డీలర్లకు కేటాయించినట్లు తెలిపారు. ఇండెంట్ల మేరకు మార్క్‌ఫెడ్‌ నుంచి ఆర్‌ఎస్‌కేలు, సొసైటీలు, ఎఫ్‌పీవోలకు, ప్రైవేట్‌ డీలర్ల నుంచి రీటైల్‌ దుకాణాలకు సరఫరా చేసి రైతులకు అందుబాటులో పెడతారని తెలిపారు.

సాగునీటి నిర్వహణపై నిర్లక్ష్యమేల?

- హెచ్చెల్సీ నీటి నిర్వహణ గందరగోళం
- ఏ ఉపకాల్వకు ఎన్నిరోజులు నీరిస్తారో తెలియని వైనం
- సాగుకు సమాయత్తమవుతున్న రైతులు
- ఈసారి ఐఏబీ సమావేశానికి రాంరాం
- ప్రజాప్రతినిధుల తీరుపై సర్వత్రా విమర్శలు



హెచ్చెల్సీలో నీటి ప్రవాహ దృశ్యం



రాగులపాడు వద్ద హంద్రీ-నీవా కాలువలోకి నీటిని ఎత్తిపోస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్‌: తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) నీటి నిర్వహణలో ఈ ఏడాది గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కీలకమైన సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశానికి ఈసారి మంగళం పాడబోతున్నారు. ఫలితంగా రైతులకు సరైన సమాచారం లేక ఏ పంటలు సాగు చేసుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హెచ్చెల్సీతో పాటు హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా వస్తున్న తుంగభద్ర, కృష్ణాజలాల వినియోగానికి ఐఏబీ సమావేశం కీలకం. ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు అక్కడి అవసరాలను సమావేశంలో లేవనెత్తి రైతులకు ఉపయుక్తంగా నీటి పంపిణీ జరిగేందుకు కృషి చేసేవారు. కానీ ఈసారి తుంగభద్ర జలాశయం నుంచి నీటి సరఫరా ప్రారంభమై నెలలు గడుస్తున్నా పంపిణీపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించడం లేదు. తుంగభద్ర జలాశయం నుంచి ఈఏడాది 24.068 టీఎంసీలు కేటాయించగా ఇప్పటి వరకూ 10.443 టీఎంసీలు జిల్లాకు వచ్చాయి. ఈ నీటిని ఎగువన హెచ్‌ఎల్‌ఎంసీ, గుంతకల్లు బ్రాంచ్‌ కెనాల్‌కు విడుదల చేయడంతో పాటు మిగిలిన నీటిని పీఏబీఆర్‌, ఎంపీఆర్‌ల ద్వారా ఎంపీ సౌత్‌, నార్త్‌ కెనాళ్లకు విడుదల చేస్తున్నారు. అయితే నీటి విడుదల విషయాన్ని రైతులకు కూడా తెలియలేదు. అధికారులే నీటి విడుదల చేస్తున్నారు. ఉన్నఫలంగా నీటిని విడుదల చేస్తుండడంతో పంటల సాగుపై తికమక పడుతున్నారు. వరి లాంటి దీర్ఘకాలిక పంటలు వేసుకోవాలా... లేదా ఆరుతడి పంటలు వేసుకోవాలా అన్న గందరగోళం నెలకొంది. ప్రస్తుతం ఖరీఫ్‌ సీజన్‌ ముగుస్తోంది. రబీ సీజన్‌ త్వరలో ప్రారంభం కానుంది. ఎటూ కాకుండా మధ్యలో నీటిని విడుదల చేస్తుండడంతో ఏ పంటలు సాగు చేసుకోవాలో పాలుపోవడం లేదని రైతులు మదనపడుతున్నారు. వరి నార్లు పోసుకున్న తర్వాత 90 రోజులే నీటిని విడుదల చేస్తామంటే పంట చివరలో నష్టపోతామనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. హెచ్చెల్సీ కింద దాదాపు 1.20 లక్షల ఎకరాల వరకూ వివిధ రకాల పంటలు సాగవుతాయి. హెచ్చెల్సీతో పాటు ఈ ఏడాది హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా కూడా నీరు వస్తోంది. ఆ నీటిని కూడా ఎలా వినియోగిస్తున్నారో ఎవరికీ తెలియడం లేదు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కుప్పానికి తరలిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో కూటమి పార్టీలకు 14 మంది ఎమ్మెల్యేలు ఉన్నా నీరు పక్క జిల్లాకు తరలిపోతుంటే ఏం చేస్తున్నారనే విమర్శలను ఎక్కడ ఎదుర్కోవాల్సి వస్తుందోననే ఉద్దేశంతోనే ఐఏబీ సమావేశం నిర్వహణకు పెద్దగా ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

తుంగభద్ర జలాశయం నీటి నిల్వ
80.003 టీఎంసీలు

ఇన్‌ఫ్లో: **14,048** క్యూసెక్కులు

ఔట్‌ఫ్లో: **13,792** క్యూసెక్కులు

హెచ్చెల్సీకి ఈ ఏడాది కేటాయింపులు
24.068 టీఎంసీలు

ఇప్పటి వరకూ జిల్లాకు చేరింది
10.443 టీఎంసీలు

పీఏబీఆర్‌లో నీటి నిల్వ
4.875 టీఎంసీలు

ఎంపీఆర్‌లో నీటి నిల్వ
3.006 టీఎంసీలు

ఐఏబీ సమావేశం నిర్వహించాల్సి ఉంది

సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించాల్సి ఉంది. సీఎం పర్యటనలు, అసెంబ్లీ సమావేశాల వలన ప్రజాప్రతినిధులు బిజీగా ఉన్నారు. అందులోనూ కలెక్టర్‌ బదిలీ కావడం వల్ల ఆలస్యమైంది. త్వరలో నూతన కలెక్టర్‌ దృష్టికి తీసుకుపోయి ఐఏబీ సమావేశం నిర్వహిస్తాం. ఇప్పటికే దాదాపు అన్ని ఉప కాలువలకు నీటిని విడుదల చేశాం. ఆయా ఉపకాలువల కింద రైతులు ఇష్టమైన పంటలు సాగు చేసుకోవచ్చు.
– సుధాకర్‌రావు, ఎస్‌ఈ, హెచ్చెల్సీ

పరిశ్రమలతోనే జిల్లా ప్రగతి

- కలెక్టర్‌ ఆనంద్‌



అనంతపురం అర్బన్‌: పరిశ్రమల ఏర్పాటుతోనే జిల్లా ప్రగతి, సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్‌ ఆనంద్‌ పేర్కొన్నారు. కలెక్టర్‌ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ పారిశ్రామికరంగాన్ని పటిష్ట పరిచేలా, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. సింగిల్‌ డెస్క్‌ పోర్టల్‌ ద్వారా అన్ని అనుమతులు సకాలంలో మంజూరు చేసి పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న తిమ్మసముద్రం, ఊరిచింతల, కూడేరు ప్రాంతాల్లో ఎంఎస్‌ఎంఈ పారిశ్రామిక వాడలను త్వరితగతిన అభివృద్ధి చేయాలని ఏపీఐఐసీ జోనల్‌ మేనేజర్‌ను ఆదేశించారు. పీఎంఈజీపీ ద్వారా అర్హులైన వారి నుంచి మంచి ప్రాజెక్టులను ఎంపిక చేయాలని పరిశ్రమల శాఖ అధికారిని సూచించారు. ఇటీవల ప్రారంభమైన రతన్‌ టాటా ఇన్నోవేషన్‌ హబ్‌లో స్టార్టప్‌లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. రాయదుర్గానికి చెందిన పారిశ్రామికవేత్తకు స్థలసేకరణ చేయాలని ఆదేశించారు. స్టాండప్‌ ఇండియా పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. సమావేశంలో ఇండస్ట్రియల్‌ పాలసీ కింద 17 యూనిట్లకు పెట్టుబడి, విద్యుత్‌, వడ్డీ, స్టాంప్‌డ్యూటీ రాయితీలకు రూ.93 లక్షల సబ్సిడీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్‌ యాదవ్‌, అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రాజశేఖర్‌రెడ్డి, డీటీసీ వీర్రాజు, ఎల్‌డీఎం నరేష్‌రెడ్డి, ఏపీఐఐజీ డిప్యూటీ జోనల్‌ మేనేజర్‌ దేవకాంతమ్మ పాల్గొన్నారు.

పప్పుశనగ కేటాయింపులకు కత్తెర

- రబీ విత్తన పంపిణీపై స్పష్టత కరువు
- గత ఏడాది 28వేల క్వింటాళ్ల విత్తనం
- ఈసారి 14వేల క్వింటాళ్లకు కుదింపు



అనంతపురం అగ్రికల్చర్‌: నల్లరేగడి భూముల్లో రబీ పంటగా పప్పుశనగ సాగు చేసే రైతులకు రాయితీ విత్తనం ఎపుడు ఇస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. అక్టోబర్‌ ఒకటి నుంచి రబీ మొదలు కానున్నా... విత్తనానికి సంబంధించి ఎలాంటి ప్రక్రియ ప్రారంభించలేదు. మరోపక్క ఈసారి జిల్లాకు విత్తన కేటాయింపుల్లో కూటమి ప్రభుత్వం కత్తెర వేసినట్లు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది 28 వేల క్వింటాళ్ల విత్తన పప్పుశనగ జిల్లాకు కేటాయించారు. అయితే ఈసారి 14 వేల క్వింటాళ్లకు కుదించినట్లు తెలుస్తోంది. దీంతో వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్‌ అధికారులు కాస్తంత ఆందోళన వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది. కేటాయింపులు పెంచాలని మరోసారి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. దీంతో పంపిణీ ప్రక్రియకు అంతరాయం ఏర్పడుతున్నట్లు చెబుతున్నారు. గతంలో 2019–24 మధ్య వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏటా రబీలో 40 శాతం రాయితీతో అక్టోబర్‌ మొదటి వారంలోనే విత్తన పప్పుశనగ సాఫీగా అందించింది. కానీ కూటమి సర్కారు గత రబీలో రాయితీకి కూడా కొర్రీలు వేసింది. 40 శాతం ఉన్న రాయితీని 25 శాతానికి తగ్గించడంతో జిల్లా రైతులపై రూ.5 కోట్లకు పైగా అదనపు భారం పడింది. ఈసారైనా రాయితీ పెంపు చేస్తారా లేదంటే 25 శాతంతోనే ఇస్తారా అనేది స్పష్టత రాలేదు.

విత్తనం కోసం ఎదురుచూపు

రబీ సమీపిస్తుండటంతో నల్లరేగళ్లు సిద్ధం చేసుకున్న రైతులు విత్తన పప్పుశనగ కోసం ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్‌లో వర్షాభావం వల్ల నల్లరేగడి భూములు కలిగిన చాలా ప్రాంతాల్లో పంట వేయకుండా ఖాళీగానే ఉంచుకున్నారు. వర్షాలు కూడా కురుస్తుండటంతో ముందస్తు సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. జిల్లాలో రబీ ప్రధాన పంటగా 25 మండలాల్లో 70 వేల నుంచి 80 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పంట సాగులోకి రావచ్చని అంచనా వేస్తున్నారు. విత్తన పంపిణీ 22 మండలాల పరిధిలో చేపట్టే అవకాశం కనిపిస్తోంది. అనంతపురం, ఆత్మకూరు, కూడేరు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, బెళుగుప్ప, బొమ్మనహాళ్‌, కణేకల్లు, డి.హీరేహాళ్‌, గుత్తి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, పామిడి, శింగనమల, యాడికి, పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, గుంతకల్లు మండల పరిధిలో జేసీ–11 రకం విత్తనం పంపిణీ చేయనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

ఆర్టీసీ ఎండీకి నిరసన సెగ



జీతాలు పెంచాలని ఎండీని కోరుతున్న కార్మికులు

తాడిపత్రిటౌన్‌: ఆర్టీసీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ (ఎండీ) ద్వారకా తిరుమలరావుకు పారిశుధ్య కార్మికుల నుంచి నిరసన సెగ తాకింది. స్త్రీశక్తి పథకం అమలు తీరును పరిశీలించేందుకు తాడిపత్రిలో శుక్రవారం పర్యటించిన ఆయన్ను పారిశుధ్య కార్మికులు చుట్టుముట్టారు. వేతనాలు పెంచి తమ కుటుంబాలను ఆదుకోవాలని కార్మికులు కోరారు. త్వరలోనే కమిటీ ఏర్పాటు చేసి తీపి కబురు చెబుతామని ఎండీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించి స్త్రీశక్తి అమలు తీరుపై ప్రయాణికులను ఆరా తీశారు.

త్వరలో ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చే ఎలక్ట్రిక్‌ ఏసీ బస్సుల్లోనూ అమలు చేయనున్నట్లు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ త్వరలో వెయ్యి ఎలక్ట్రిక్‌ ఏసీ బస్సులు ప్రవేశపెడుతున్నామన్నారు. ఇందులో తిరుపతికి 300, విశాఖకు 100, మరో 12 డిపోలకు 50 బస్సుల చొప్పున కేటాయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీ జగదీష్‌, ఏఎస్పీ రోహిత్‌కుమార్‌ చౌదరి, ఆర్టీసీ డీఎం మురళీధర్‌ పాల్గొన్నారు.

అచ్చోసిన ఆంబోతులా బాలకృష్ణ తీరు

- చిరంజీవిపై వ్యాఖ్యలు దుర్మార్గం
- పవన్‌ స్పందించకపోవడం దారుణం
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: పవిత్రమైన అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తూలుతూ మాట్లాడిన తీరు అచ్చోసిన ఆంబోతులా ఉందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన అనంతపురంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే పదవిలో ఉంటూ హుందాగా మాట్లాడాల్సిన బాలకృష్ణ తూలుతూ నోటికొచ్చినట్టు మాట్లాడటాన్ని తప్పుపట్టారు. చిత్ర పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై సినీ పెద్దలైన చిరంజీవి గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రితో జరిపిన చర్చల గురించి కామినేని శ్రీనివాస్‌ ప్రస్తావించగా.. బాలయ్య కల్పించుకుని అవాకులు చెవాకులు పేలారన్నారు. ఆయన అసెంబ్లీలో మాట్లాడుతుంటే తోటి సభ్యులంతా ఒక పిచ్చోడిని చూసినట్టే చూస్తుంటారని, ఎందుకంటే బాలయ్య మాట తీరు అలా ఉంటుందని అన్నారు. దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చలు జరిపిన చిరంజీవిని ఉద్దేశించి వాడు, వీడు అంటూ కరడుగట్టిన కులతత్వం, అధికార మదంతో బాలయ్య చేసిన వ్యాఖ్యలు హేయమైనవని అన్నారు. తన అన్నపై ఇంత దారుణంగా బాలకృష్ణ మాట్లాడుతున్నా సభలోనే ఉన్న డిప్యూటీ సీఎం పవన్‌ కల్యాణ్‌ ఖండించకపోవడం, కనీసం జనసైనికులు దీనిపై మాట్లాడకపోవడం విస్మయానికి గురి చేస్తోందన్నారు. చంద్రబాబు చేతిలో కీలుబొమ్మలా మారిన పవన్‌.. తన అన్నను అవమానపరిచినా తుడుచుకుని వెళ్లిపోయేలా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. చివరకు చిరంజీవి స్పందించి ఆనాడు చర్చల్లో పాల్గొనేందుకు బాలయ్య కోసం ఎన్నిసార్లు ప్రయత్నించారో, తర్వాత చర్చలు సుహృద్భావ వాతావరణంలో జరిగిన తీరును లేఖద్వారా తెలియజేశారన్నారు. బాలకృష్ణకు మానసిక స్థితి సరిగా లేదని, ఆయన్ని యర్రగడ్డ మెంటల్‌ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తే బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ ట్రేడ్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు బెస్తరమణ పాల్గొన్నారు.

బీకేఎస్‌ ఎంపీపీపై అవిశ్వాసం!

- కలెక్టర్‌, జెడ్పీ డిప్యూటీ సీఈఓలకు విన్నవించిన ఎంపీటీసీలు



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం సిటీ/ బుక్కరాయసముద్రం: పార్టీ కట్టుబాటు తప్పి.. నమ్మకద్రోహం చేసిన బుక్కరాయసముద్రం ఎంపీపీ దాసరి సునీతపై వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు శుక్రవారం కలెక్టర్‌ ఆనంద్‌, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్యను వేర్వేరుగా కలిసి విన్నవించారు. బుక్కరాయసముద్రం మండలంలో మొత్తం 19 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. నాలుగేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో 14 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందగా, ఐదు స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. బుక్కరాయసముద్రం–2 స్థానం నుంచి గెలుపొందిన దాసరి సునీతకు ఎంపీపీ పగ్గాలు అప్పగించారు. అప్పట్లోనే ఒక ఒప్పందం కుదిరింది. మొదట ఎంపీపీ పగ్గాలు చేపట్టిన వారు రెండేళ్లు, ఆ తరువాత అధికారం చేపట్టే వారు మూడేళ్లు ఎంపీపీగా కొనసాగాలని ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందానికి కట్టుబడి దాసరి సునీత తొలిసారి ఎంపీపీ బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లు గడిచిన తర్వాత మరో ఆరు నెలలు తనకు అవకాశం కల్పించాలని కోరగా.. వైఎస్సార్‌సీపీ పెద్దలు సరేనన్నారు. ఆ గడువు ముగియగానే బుక్కరాయసముద్రం–1 ఎంపీటీసీ సభ్యురాలు కాలువ వెంకటలక్ష్మికి ఎంపీపీ పగ్గాలు అప్పగించాలి. అయితే దాసరి సునీత పదవి నుంచి తప్పుకోకుండా దాటవేస్తూ వచ్చారు. దీంతో మిగిలిన సభ్యులు ఆమెను వ్యతిరేకించారు.

పార్టీ ఫిరాయింపుతో అసలుకే ఎసరు

ఒప్పందం మేరకు ఎంపీపీ పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకొని రాజకీయ విలువలు కాపాడాలని మిగిలిన సభ్యులు సునీతకు సూచిస్తూ వచ్చారు. అయితే వాటిని ఆమె పెడచెవిన పెట్టడమే గాక ఏకంగా పార్టీ ఫిరాయించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆమె టీడీపీలోకి చేరిపోయారు. దీంతో టీడీపీ ఎంపీటీసీ సభ్యుల సంఖ్య ఆరుకు చేరగా, వైఎస్సార్‌సీపీ సభ్యుల సంఖ్య 13కు చేరింది. ఇప్పటికీ వైఎస్సార్‌సీపీకే స్పష్టమైన మెజారిటీ ఉంది. అయినా ఎంపీపీ సునీత పదవి వీడకుండా మొండిగా వ్యవహరిస్తున్నారు.

అవిశ్వాస తీర్మానానికి పట్టు

ఎంపీపీ సునీతపై తక్షణం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ఎంపీటీసీ సభ్యులు మూకుమ్మడిగా వైఎస్సార్‌సీపీ పెద్దల దృష్టికి తెచ్చారు. ఇదే అంశంపై పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, శింగనమల సమన్వయకర్త సాకే శైలజానాథ్‌తో రెండు రోజులపాటు మంతనాలు జరిపారు. వారి సూచన మేరకు శుక్రవారం ఎంపీటీసీ సభ్యులు నామాల శిరీష (బీకేఎస్‌–4), బుల్లే సుజాత (బీకేఎస్‌–5), వడ్డే రాజ్యలక్ష్మి (బీకేఎస్‌–6), భాస్కర్‌రెడ్డి (రేగడ కొత్తూరు), రాంగోపాల్‌(వడియంపేట), ఎర్రినాగప్ప (గోవిందంపల్లి), అంజినరెడ్డి (చెదళ్ల), సాకే జయలక్ష్మమ్మ (రెడ్డిపల్లి), శివారెడ్డి (దయ్యాలకుంట్లపల్లి), కుళ్లాయప్ప (వెంకటాపురం), రామచంద్ర (కె.కె.అగ్రహారం), నాగయ్య (చెన్నంపల్లి) అనంతపురానికి చేరుకున్నారు. ముందుగా డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్యను కలసి అవిశ్వాస తీర్మానం కోసం వినతిపత్రమందించారు. ఆ తర్వాత జెడ్పీ క్యాంప్‌ కార్యాలయంలో చైర్‌పర్సన్‌ బోయ గిరిజమ్మను కలిసి, చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్‌, సర్పంచులు పార్వతి, శ్రీనివాసరెడ్డి, ఎర్రిస్వామి, వైఎస్సార్‌సీపీ బుక్కరాయసముద్రం మండల శాఖ అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ సీనియర్‌ నాయకులు ముసలన్న, మల్లికార్జున, పూల నారాయణస్వామి, పురుషోత్తం, చికెన్‌ నారాయణస్వామి తదితరులు విలేకరులతో మాట్లాడారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత ముఖ్యమన్నారు. ఒప్పందం ఉల్లంఘించిన దాసరి సునీత ఎంపీపీ పదవిలో ఉండటానికి ఏమాత్రమూ అర్హురాలు కాదన్నారు. అనంతరం అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌ ఆనంద్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. శనివారం అనంతపురం ఆర్డీఓ గుత్తా కేశవనాయుడును కలిసి అవిశ్వాస తీర్మాన నోటీసు అందజేస్తామని చెప్పారు.

ఐదేళ్ల నిరీక్షణ.. ఐదు రోజులకే విషాదం!

- డాక్టర్ల నిర్లక్ష్యంతో బాబు మృతి
- 'అమ్మ' ఆస్పత్రిలో ఫర్నీచర్‌ ధ్వంసం చేసిన బాధితులు





మృతి చెందిన పసికందు, విలపిస్తున్న శిరీష, జయసింహ

అనంతపురం మెడికల్‌: ఆ దంపతులు సంతానం కోసం ఐదేళ్లు నిరీక్షించారు. ఎట్టకేలకు తొలిచూరి కాన్పులో మగబిడ్డ జన్మించాడు. అయితే ఆ బిడ్డ ఐదు రోజులకే కన్నుమూశాడు. ఈ ఘటన ఆ దంపతులను కలచివేసింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే బిడ్డ మృతి చెందాడంటూ బంధువులు ఆగ్రహించి ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన మేరకు... నగరంలోని హనుమాన్‌ కాలనీకి చెందిన శిరీష, జయసింహ దంపతులు. ఐదేళ్ల నిరీక్షణ అనంతరం శిరీష తొలిచూరి గర్భం దాల్చింది. నగరంలోని అమ్మ ఆస్పత్రిలో గైనకాలజిస్ట్‌ డాక్టర్‌ శివజ్యోతి వద్ద చూపించుకుంటూ వచ్చింది. ఈ నెల 20న అదే ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే బిడ్డ ఆరోగ్యం బాగోలేదని డాక్టర్‌ సూచన మేరకు కుటుంబ సభ్యులు సాయినగర్‌లోని హృదయ చిన్నపిల్లల ఆస్పత్రిలో చేర్పించారు. 23వ తేదీ వరకు అంటే మూడు రోజులకే రూ.3.50 లక్షలకు పైగా ఖర్చయ్యింది. అయితే బిడ్డలో అవయవాలు ఒక్కొక్కటిగా ఫెయిల్యూర్‌ అవుతున్నాయని, మరొక ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిందిగా వైద్యులు సూచించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ఈ నెల 24వ తేదీన బిడ్డను ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చేర్పించారు. అయినా ఫలితం లేకపోయింది. 25వ తేదీ ఆ బిడ్డ చనిపోయాడు. బిల్లు చెల్లించిన తర్వాతనే బిడ్డను బయటకు తీసుకుపోండని హృదయ ఆస్పత్రి నిర్వాహకులు కర్కశంగా వ్యవహరించి జాప్యం చేయడం వల్లే తమ బిడ్డ మరణించాడంటూ శిరీష, జయసింహ దంపతులు ఆరోపించారు. గైనకాలజిస్ట్‌ శివజ్యోతి కూడా సకాలంలో ప్రసవం చేయకపోవడం వల్లే బిడ్డ ఆరోగ్యం తల్లకిందులైందని ఆరోపిస్తూ బాధితులు బంధువులతో కలిసి శుక్రవారం అమ్మ ఆస్పత్రికి చేరుకుని ఆందోళన చేశారు. ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్‌ మనోరంజన్‌రెడ్డి, గైనకాలజిస్టు డాక్టర్‌ శివజ్యోతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తప్పిదం లేదని వారు చెప్పడంతో ఆగ్రహించిన బాధితులు ఆస్పత్రిలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఘటనపై ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్‌ మనోరంజన్‌రెడ్డిని 'సాక్షి' వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. చివరకు త్రీటౌన్‌ సీఐ శాంతిలాల్‌ సమక్షంలో ఇరు వర్గాల వారు మాట్లాడుకున్నారు.

ఉమ్మడి జిల్లాకు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్‌: రాగల రెండు రోజులు ఉమ్మడి జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ ఎం.విజయశంకరబాబు, సీనియర్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ జి.నారాయణస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న 10.5 మి.మీ సగటుతో మోస్తరుగా వర్షం పడే సూచన ఉందని పేర్కొన్నారు. అలాగే 28న 3 మి.మీ సగటు వర్షపాతం నమోదు కానుందని తెలిపారు. 29, 30, 31 తేదీల్లో కూడా తుంపర్లు పడవచ్చని పేర్కొన్నారు

క్లుప్తంగా

'వికసిత్ భారత్' పోటీలు

అనంతపురం కల్చరల్: వికసిత భారత్ యంగ్ లీడర్స్ నినాదంతో యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యువతకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు ఆన్‌లైన్ ద్వారా అక్టోబరు 15 వరకు సాగుతాయి. ఈ మేరకు ఆన్‌సెట్, యువజన సంక్షేమశాఖ అధికారి రవి శంకర్‌రెడ్డి తెలిపారు. పూర్తి వివరాలకు https://mybharat.gov.in/pages/vbyld-2026 వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

ఆర్డీటీ అంశంపై సీఎంతో స్పష్టత ఇప్పించాలి

- సేవ్ ఆర్డీటీ అఖిలపక్ష కమిటీ నాయకుల డిమాండ్

అనంతపురం టవర్‌క్లాక్: ఉమ్మడి జిల్లాకు వర దాయినిగా ఉన్న ఆర్డీటీ సేవల పునరుద్ధరణపై అసెంబ్లీ సమావేశాల్లో సీఎం చంద్రబాబుతో స్పష్టమైన హామీని ఇప్పించకపోతే ఎమ్మెల్యే లను జిల్లాలో కాలు పెట్టనివ్వకుండా అడ్డుకుం టామని సేవ్ ఆర్డీటీ అఖిలపక్ష కమిటీ నాయ కులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్ల బ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ నాయకులు సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, సాకే హరి, కేవీ రమణ, మందల రమేష్, కేపీ నారాయణ స్వామి తదితరులు మాట్లాడారు. నిధులు అందకుండా చేయడం దుర్మార్గమన్నారు. సమావేశంలో అఖిలపక్ష కమిటీ నాయకులు కుంటిమద్ది ఓబులేసు, ఐఎంఎం బాషా, రాజు, చెన్నకేశవులు, చిన్న ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లోనూ కక్కుర్తి!

- పక్కదారి పట్టిన విత్‌హెల్డ్ ఉపాధి నిధులు
- చేతివాటం చూపిన టెక్నికల్ అసిస్టెంట్
- తన భార్య బ్యాంక్ ఖాతాలోకి ఎస్‌డబ్ల్యూపీసీ నిధులు
- తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

గ్రామీణ పేదలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం పక్కదారి పట్టింది. కాదేదీ అవినీతికి అనర్హం అనే రీతిలో కొందరు అధికారులు ఉపాధి నిధులు స్వాహా చేస్తున్నారు.

తాడిపత్రిటౌన్: ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్.. అనే చందంగా మారింది మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికా రుల తీరు. ఓ టెక్నికల్ అసిస్టెంట్ చేతివాటాన్ని ప్రదర్శించి ఎస్‌డబ్ల్యూపీసీ (సాలిడ్ వేస్ట్ ప్రాసెసిం గ్ సెంటర్) నిధులను ఏకంగా తన భార్య బ్యాంక్ ఖాతాలోకి మళ్లించుకుని కూలీలను నిట్టనిలువునా ముంచేశాడు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

కూలీలను కాదని..

తాడిపత్రి మండలంలో 22 పంచాయతీలు ఉండ గా... 21 పంచాయతీల్లో 2014-19 మధ్య కాలం లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. ఒక్కో కేంద్రానికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకూ వెచ్చించారు. ఈ మొత్తం నిధుల్లో 25 శాతం అంటే రూ.3 లక్షలను అప్పటి ప్రభుత్వం విత్‌హెల్డ్‌లో ఉంచింది. ఈ నిధులు పది రోజుల క్రితం విడుదలయ్యాయి. వీటిని పం చాయతీల వారీగా ఉపాధి కూలీల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేయాల్సి ఉండగా... ఇందుకు విరుద్ధంగా ఓ టెక్నికల్ అసిస్టెంట్ తన చేతి



తాడిపత్రి మండలం సజ్జలదిన్నెలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

వాటాన్ని ప్రదర్శించాడు. దాదాపు రూ.90 వేలను తన భార్య బ్యాంక్ ఖాతాలోకి బదలాయించుకు ని, ఉపాధి కూలీలకు మొండి చెయ్యి చూపాడు.

అక్రమాలకు అధికారుల ఊతమా?

ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకుంటున్న అక్రమాలకు అధికారులు ఊతమిస్తున్నారా అనే ప్రశ్నకు ఔననే సమాధానమే వినిపిస్తోంది. పనుల కల్పన మొదలు... బిల్లుల చెల్లింపు వరకూ కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకూ ప్రతి అధికారీ తన చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఉన్నతాధికా రుల లొసుగులన్నీ తమ గుప్పిట్లో పెట్టుకుని కింది స్థాయి సిబ్బంది ఆడింది ఆట.. పాడింది పాటగా రెచ్చిపోతున్నారు. దీంతో కింది స్థాయి సిబ్బంది బ్లాక్‌మెయిల్‌కు తలొగ్గి అక్రమాలను చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇం దుకు నిదర్శనమే తాజాగా తాడిపత్రి మండలం లో చోటు చేసుకున్న విత్‌హెల్డ్ నిధులు పక్కదారి పట్టిన అంశం. అక్రమాలకు పాల్పడిన టెక్నికల్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటే గతంలో తాము చేసిన అక్రమాలు అతను బయటపెడతాడనే భయం వారిని వెన్నాడుతుండడంతో... చడీచ ప్పుడు చేయకుండా ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు పదేళ్ల క్రితం చేసిన పనులకు సంబంధిం చిన నిధులు కావడంతో ఈ విషయాన్ని ఉపాధి కూలీలు సైతం మరిచిపోయారు. ఇదే అదనుగా ఉపాధి కూలీలను దగా చేస్తూ ఆ సొమ్మును అధి కారులు పంచుకున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి.

> **నాకు తెలియదు..**
>
> సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ నిర్మాణాల అం శానికి సంబంధించి విత్‌హెల్డ్‌లో ఉంచిన నిధులు అందిన మాట వాస్తవం. అయితే ఈ నిధులను టెక్నికల్ అసిస్టెంట్ తన భార్య బ్యాంక్ ఖాతాకు మళ్లించుకున్న విషయం నాకు తెలి యదు. ఈ విషయంపై విచారణ చేపడతాం.
>
> – ఫజుల్ బాషా, ఎంపీడీఓ

దబిడిదిబిడే అంటే కుదరదు



బాలకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యువజన, విద్యార్థి విభాగాల నాయకులు



అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న నాయకులు

- బాలయ్య వ్యాఖ్యలపై భగ్గుమన్న విద్యార్థి, యువజన విభాగం

అనంతపురం కార్పొరేషన్: బాధ్యతగల ఎమ్మెల్యే పదవిలో ఉంటూ సినిమాల్లోలా దబిడిదిబిడే అం టూ చౌకబారు వ్యాఖ్యలు చేస్తే కుదరదని హిం దూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను వైఎస్సార్ విద్యా ర్థి, యువజన విభాగాలు హెచ్చరించాయి. అత్యం త ప్రజాదరణ కలిగిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఉద్దేశించి అసెంబ్లీ సాక్షిగా బాలయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. బాలకృష్ణ చిత్రప టాన్ని చెప్పులతో కొట్టారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, యువజన విభాగం నగరాధ్యక్షుడు శ్రీనివాస దత్తా మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ పాలనలో విద్య, వైద్యంతో పాటు వివిధ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన అప్పటి సీఎం జగన్ విశేష ప్రజాదరణను సొంతం చేసుకున్నారన్నారు. బాలకృష్ణ తన హుందాను మరచి నోరు పారేసు కుంటూ పోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్ప దన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదు, నగర ఉపా ధ్యక్షుడు ఉదయ్, విద్యార్థి విభాగం నగరాధ్యక్షుడు కైలాష్, నాయకులు మసూద్ అలి, మహ్మద్ రఫీ, సురేష్, అకాష్, సాదిక్, వినీత్ పాల్గొన్నారు.

బాలకృష్ణ దిష్టిబొమ్మ దహనం

వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మదిరెడ్డి నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద బాలకృష్ణ దిష్టిబొ మ్మను దహనం చేశారు. నరేంద్రరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. తన తప్పు తెలుసుకుని ఆయన మాటలు వెనక్కు తీసుకోవాలన్నారు. గతంలో ఇంటిలో కాల్పులు జరిగిన ఘటనలో బాలకృష్ణను రక్షించిందెవరో ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కార్యక్ర మంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి నితిన్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌రెడ్డి, నాయకులు సుధీర్, మాధ వరెడ్డి, లోకేష్‌శెట్టి, హేమంత్ యాదవ్, వడ్డే ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్ష

అనంతపురం: అత్యాచారం కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ అనంతపురం నాల్గో అదనపు జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వివ రాలు.. మడకశిర సర్కిల్ పరిధిలోని రొళ్ల మండలం రంగ ణపల్లి గ్రామానికి చెందిన సిద్ధరాజు అలియాస్ సిద్ధయ్య 2018లో ఓ మహిళపై అత్యాచారం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. అప్పట్లో రొళ్ల ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా ఉన్న ఎం.శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో మడకశిర సీఐలుగా ఉన్న బి.శుభకుమార్, కె.దేవానంద్ ఈ కేసును దర్యాప్తు చేసి అనంతపురం నాల్గో ఏడీజే కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు శుక్రవారం తుది విచారణకు రాగా, ఏపీపీ సుజనారెడ్డి వాదనలు వినిపించారు. నాల్గవ ఏడీజే కోర్టు న్యాయమూర్తి టి.హరిత కేసు పూర్వాపరాలు, సాక్ష్యాలను పరిశీలించి ముద్దాయి సిద్ధరాజు అలియాస్ సిద్ధయ్య నేరం చేసినట్లు రుజువైనందున ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమాన విధిస్తూ తీర్పు చెప్పారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు ముద్దాయిని పోలీసులు కడప సబ్ జైలుకు తరలించారు.

జెడ్పీలో సంబరాలు



కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: జెడ్పీ చైర్మన్‌గా బోయ గిరిజమ్మ నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయిన నేపథ్యంలో శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో ఉద్యోగులు సంబరాలు నిర్వహిం చారు. డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్య, ఉద్యోగులతో కలసి ముందుగా తన చాంబర్‌లో గిరిజమ్మ కేక్ కట్ చేసి, పంచారు. ఈ సందర్భంగా గిరిజమ్మకు ఉద్యోగులు పుష్ప గుచ్ఛాలు అందించి, శాలువ కప్పి సత్కరించారు. నాలుగేళ్ల తన పదవీ కాలంలో తనకు అన్ని విధాలుగా సహకరిస్తూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సహకరించిన ఉద్యోగులకు గిరిజమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

దొంగతనం చేస్తూ పట్టుబడిన మహిళలకు దేహశుద్ధి

శింగనమల(నార్పల): దొంగతనం చేస్తూ పట్టుబడిన మహిళలకు స్థానికులు దేహశుద్ధి చేసిన ఘటన శుక్రవారం నార్పలలో చోటు చేసుకుంది. వివరాలు.. నార్పలలో ఆటోలో ఉన్న ప్రయాణికురాలి వద్దకు బురఖా ధరించిన ఇద్దరు మహిళలు చేరుకుని మాటలు కలిపి, ఆమె వద్ద ఉన్న పర్సును అపహరించారు. గమనించిన స్థానికులు వెంటనే బంధించి ప్రయాణికురాలికి పర్సును ఇప్పిం చారు. దేహశుద్ధి చేసి ఆరా తీయడంతో తమది ఒంగోలు ప్రాంతమని వారు అంగీకరించారు. అనంతరం వారిని పోలీసులకు అప్పగించారు.

స్పందించకపోతే ఉద్యమం తీవ్రతరం

- ఉద్యోగులను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న మల్లు రఘునాథరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని కూటమి ప్రభుత్వాన్ని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి హెచ్చరించారు. స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఎస్టీయూ జిల్లా రెండో కార్యవర్గ సమా వేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నీలూరి రమ ణారెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది.ముఖ్య అతిథిగా హాజరైన రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. మెరుగైన పీఆర్సీ, మధ్యంతర భృతి, సీపీఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్, ఆర్థిక బకాయిల చెల్లిం పు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు అంటూ ఎన్ని కల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షన ర్లకు కూటమి పెద్దలు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన తర్వాత ఓ ఒక్క హామీని నెరవేర్చకుండా మోసం చేశారని ధ్వజమె త్తారు. 27 నెలలుగా ఆలస్యం చేస్తూ వచ్చిన 12వ పీఆర్సీని తక్షణమే ప్రకటించాలని, 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 2024, జనవరి నుంచి ఇప్పటి వరకూ బకాయి పడిన నాలుగు డీఏలు మంజూరు చేయాల న్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుపై ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించక పోతే అక్టోబర్ 7న విజయవాడలో వేలాది మందితో ధర్నా చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనే యులు, ఆర్థిక కార్యదర్శి గంటే ప్రసాద్, విశిష్ట అతి థులు సీపీఐ జిల్లా కార్యదర్శి పి నారాయణస్వామి, సహాయ కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి నాగ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలకృష్ణా.. పొగరు తగ్గించుకో

- నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించం
- మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



గుంతకల్లు టౌన్: అసెంబ్లీ సాక్షిగా ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి హిం దూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన అను చిత వ్యాఖ్యలు చాలా దుర్మార్గంగా ఉన్నాయని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. బాలకృష్ణ వ్యాఖ్యలను ఖండించారు. బాలకృష్ణ పొగరు తగ్గించుకోవాలని హితవు పలికారు. తప్పతాగి మరోసారి వైఎస్.జగన్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కాల్పుల కేసులో బాలకృష్ణను దివంగత డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి మాన వత్వంతో కాపాడకపోయి ఉంటే జైల్లో ఊచలు లెక్కపెట్టేవారని గుర్తు చేశారు. బాలకృష్ణ చేష్ట లను ఆయన అభిమానులు భరిస్తారేమో కానీ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోరని స్పష్టం చేశారు.

హోంగార్డుపై టీడీపీ అల్లరి మూక దాడి



గాయపడిన హోంగార్డు పుల్లయ్య

గుంతకల్లు: రోజు వారీ విధుల్లో భాగంగా కసాపురం దేవస్థానం వద్ద డ్యూటీలో ఉన్న హోంగార్డు పుల్లయ్యపై టీడీపీ అల్లరి మూకలు విచక్షణ రహితంగా దాడికి తెగబడ్డాయి. వివరాలు.. గుం తకల్లు వన్‌టౌన్ పీఎస్‌లో పనిచేస్తున్న హోం గార్డు పుల్లయ్య గత 24 రోజులుగా కసాపురం ఆలయం వద్ద విధులు నిర్వర్తి స్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో రాజ గోపురం వద్ద విధులు నిర్వర్తిస్తున్న సమ యంలో మద్యం ఫుల్‌గా సేవించి స్కూటీపై వచ్చిన కసాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు భీమప్ప, మంజు, రాము.. పుల్లయ్యతో ఘర్షణప డ్డారు. ఆలయంలోకి వెళ్లకుండా అడ్డు కుంటావా? అంటూ భీమప్ప, మంజు కొడుతుండగా స్థానిక దుకాణదారులు అడ్డుకోవడం జారుకున్నారు. అనం తరం పుల్లయ్యను రాము తన స్కూ టీలో ఎక్కించుకుని సమీపంలోని సులభ కాంప్లెక్స్ వద్ద తీసుకెళ్లి అక్కడ కాపు కాచిన భీమప్ప, మంజుతో కలసి మరోసారి దాడి చేసి తీవ్రంగా గాయప రిచారు. వారి బారి నుంచి తప్పిం చుకుని ఆలయ ఉద్యోగుల సాయంతో గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నాడు. చికిత్స అనంతరం కసాపురం పీఎస్‌లో ఫిర్యాదు చేసి నట్లు బాధితుడు తెలిపాడు.

జీఎస్టీపై అవగాహన చర్యలు

- సీఎస్‌కు తెలిపిన కలెక్టర్ ఆనంద్



సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్, అధికారులు

అనంతపురం అర్బన్: జీఎస్టీ తగ్గింపుపై జిల్లా వ్యాప్తంగా సామాన్య ప్రజలకు అవగాహన కల్పిం చేలా చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. జీఎస్టీ, సూపర్ సేవింగ్స్, పీఎం కుసుమ్, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు, తదితర అంశాలపై సీఎస్ శుక్రవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్‌తో పాటు వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ భాస్కర్‌వల్లి, ఏపీఎస్‌పీడీ సీఎల్ ఎస్‌ఈ శేషాద్రి శేఖర్, నెడ్‌క్యాప్ అధికారి అశో క్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సరేంద్రరెడ్డి, ఇతర అధి కారులు పాల్గొన్నారు. జిల్లాలో చేపట్టిన చర్యలను సీఎస్‌కు కలెక్టర్ వివరించారు. జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టేటా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'పీఏబీఆర్ పెండింగ్ పనులకు డీపీఆర్ సిద్ధం చేయండి'

అనంతపురం సెంట్రల్: పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) నిర్మాణం సమయంలోనే అసంపూర్తిగా ఉన్న పనులకు డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయాలని సంబంధిత అధికారు లను హెచ్చెల్సీ ఎస్‌ఈ సుధాకర్‌రావు ఆదేశించారు. హెచ్చెల్సీ, జెన్‌కో అధికారులతో కలసి శుక్రవారం పీఏబీఆర్‌ను ఆయన పరిశీలించారు. పెండింగ్ పనులు పూర్తి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పీఏబీఆర్ నుంచి 600 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తూ ఎంపీఆర్‌కు జలాలు మళ్లించి, అక్కడి నుంచి పం టల సాగుకు వినియోగించేలా చర్యలు తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో జెన్‌కో ఎస్‌ఈ శ్రీనివా సులు, ఏఈఈ కిరణ్, హెచ్చెల్సీ డీఈఈ వెంకటర మణ, ఏఈఈలు ముత్యాలప్ప, గంగమ్మ, లక్ష్మీదేవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమే సతీష్‌రెడ్డిని బలిగొంది

- ప్రాథమిక విచారణలో స్పష్టమైనట్లు వెల్లడించిన డీఎస్పీ రవిబాబు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిబాబు

అనంతపురం: పామిడి మండలం జి.కొ ట్టాల గ్రామానికి చెందిన దేవన సతీష్ రెడ్డి మృతి కేవలం ప్రమాదం వల్లనే జరి గిందని గుంతకల్లు డీఎస్పీ రవిబాబు స్పష్టం చేశారు. అనంతపురం అర్బన్ డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 24న రాత్రి 8:40 గంటల సమయంలో పామిడి- నాగసముద్రం రోడ్డులోని సిమెంటు పెళ్లల ఫ్యాక్టరీ వద్ద సతీష్‌రెడ్డి రక్తగాయాలతో మృతి చెందినట్లుగా సమాచారం అందుకున్న పామిడి ఇన్‌చార్జ్ సీఐ రాజు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారన్నారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించిన అనంతరం ట్రాక్టర్ ట్రాలీకి రక్తపు మరకలు అంటిన దృశ్యాన్ని గమనించి డ్రైవర్ దేవరపల్లి సాయికుమార్‌ను విచారణ చేయడంతో ట్రాక్టర్‌లో ఇంటి సామగ్రిని పామిడి నుంచి గుత్తి మండలం బ్రాహ్మణపల్లికి చేర వేస్తుండగా మార్గమధ్యంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి ఢీకొని కిందపడిపోయినట్లుగా అంగీకరించాడన్నారు. అయితే డ్రైవర్ భయపడి ముందుకెళ్లిపోయి, సామాన్లు అన్‌లోడ్ చేసి అదే రోజు రాత్రి 11 గంటలకు తిరిగి అదే దారి గుండా వెళుతూ తన ట్రాక్టర్‌కు గుద్దుకున్న వ్యక్తి చనిపోయి ఉండటాన్ని గమనించి వాహనాన్ని పామిడిలోని ఓనర్ రాజకుళ్లాయప్ప ఇం టి వద్ద వదిలి వెళ్లిపోయాడన్నారు. సతీష్‌రెడ్డి మృతికి ప్రమాదమే కారణమనేందుకు పక్కా ఆధారాలు ఉన్నాయన్నారు. ఈ కేసులో లీగల్ ఒపీనియన్ తీసుకుని తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

16 వరకూ పోషణ్ మాసోత్సవాలు

అనంతపురం సెంట్రల్: కలెక్టర్ ఆదేశాల మేరకు అక్టోబర్ 16 వరకూ పోషణ్ మాసోత్స వాలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ నాగమణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఆరోగ్యవంతమైన మహిళా – శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాది' అనే అంశంపై జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

మొక్కజొన్న విత్తనాల మోసం



ఏజెంట్ ఇచ్చిన అగ్రిమెంట్‌ను చూపుతున్న రైతులు

బొమ్మనహాళ్: తమ కంపెనీ మొక్కజొన్న విత్తనాలు సాగు చేస్తే అధిక దిగుబడి ఖాయమంటూ రైతులకు నకిలీ విత్తనాలను బలవంతంగా అంటగట్టిన ఘటన బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరు గ్రామంలో వెలుగు చూసింది. బాధిత రైతులు తెలిపిన మేరకు... కణేకల్లు క్రాస్‌కు చెందిన ఓ ఫర్టిలైజర్ దుకాణం నిర్వాహకుడు హరినాథ్... హైదరాబాద్‌కు చెందిన బయర్ విత్తన కంపెనీ ఏజెంట్‌గా వ్యవహరిస్తు న్నాడు. ఈ క్రమంలో 2024లో దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన 50 మంది రైతులకు నమ్మబలికి మొక్కజొన్న విత్తనాలను బలవంతంగా అంటగట్టి వంద ఎకరాల్లో సాగు చేయించాడు. ఆశించిన మేర పంట దిగుబడులు రాకపోవడంతో ఏజెంట్‌ను రైతులు నిలదీశారు. దీంతో గత ఏడాది కంపెనీ ప్రతి నిధులు వచ్చి పంట పరిశీలన చేసి ఎకరాకు రూ.45 వేలు చొప్పున పరిహారం చెల్లించేలా ఒప్పంద పత్రం రాసిచ్చారు. అనంతరం ఏజెంట్ అరకొర పరిహారం చెల్లించి తర్వాత ముఖం చాటేశాడు. తమను మోసం చేసిన ఏజెంట్‌పై చర్యలు తీసుకుని పరిహారం ఇప్పిం చాలని బాధిత రైతులు మోహనందప్ప, శివగంగమ్మ, సంతోష్ వేడుకుంటున్నారు.

తప్పతాగి.. రోడ్డుపై పడి



గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట క్రాస్ వద్ద ఉన్న బ్రాందీ షాపు సమీపంలో ఓ యువ కుడు ఫుల్‌గా మద్యం తాగి రోడ్డుపై అపస్మా రకంగా పడిపోయాడు. శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. రైతులకు యూరియా అందించలేని అసమర్థ ప్రభుత్వం పల్లెల్లో మద్యానికి కొదవ లేకుండా చేస్తోందని ఈ సందర్భంగా మహిళా రైతులు అసహనం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

'ఉచిత'ం మోయలేక ఆగిపోయింది



ఆత్మకూరు: 'స్త్రీ శక్తి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ భారీగా పెరిగింది. మరోవైపు బస్సుల సంఖ్య పెరగకపోవడంతో ప్రతి బస్సూ కిటకిటలాడుతోంది. ప్రస్తుతం దసరా సీజన్ కావడంతో నూతన దుస్తులు, పండుగ సామగ్రి కొనుగోలుకు మహిళలు పెద్ద ఎత్తున జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. దీంతో బస్సులో పరిమితికి మించి ఎక్కి ప్రయాణిస్తున్నారు. ఒక బస్సులో 50 మందికి పరిమితి ఉంటే.. ప్రస్తుతం 100 నుంచి 120 మంది వరకూ ప్రయాణిస్తున్నారు. దీంతో ఉచిత భారం మోయలేక బస్సులు ఒక్కోసారి ఆగిపోతున్నాయి. ఈ క్రమంలోనే శుక్రవారం ఆత్మకూరు బైపాస్ సమీపంలో బస్సు ఇలా రోడ్డుపైనే నిలిచిపోయింది.

సామాజిక సేవ అలవర్చుకోవాలి

అనంతపురం రూరల్: విద్యార్థి దశ నుంచే సామాజిక సేవ అలవర్చుకోవాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. శుక్రవారం పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కష్టపడి చదవితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల సేవా దృక్పథంతో ఉండాలన్నారు. చదువుతో పాటు క్రీడలు. సాంస్కృతిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలన్నారు. ఏ సబ్జెక్ట్ ఎంచుకున్నామన్న దానికంటే ఎంత కష్టపడి చదివామన్నదే ముఖ్యమన్నారు. ఇంజినీరింగ్‌తో పాటు సివిల్ సర్వీసెస్, యూపీఎస్సీ వంటి అత్యున్నత లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలన్నారు. కొత్త ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల చైర్మెన్ పల్లె వెంకటకృష్ణకిశోర్, ప్రిన్సిపల్ బండి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యలో విద్యార్థులకు శిక్షణ

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు దసరా సెలవుల్లో వృత్తి విద్యలో శిక్షణ ఇప్పించినట్లు పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవి తెలిపారు. ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ కోర్సులో భాగంగా విద్యార్థులంతా మిక్సీ, వాటర్ ప్యూరిఫయర్ మరమ్మతు, సర్వీసులో శిక్షణ పొందారన్నారు. అలాగే బ్యాంకింగ్‌కు సంబంధించి శిక్షణ కూడా ఇచ్చినట్లు ఆమె వెల్లడించారు. వృత్తి విద్య ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ అలవడుతుందన్నారు. అలాగే మంచి ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడేలా ఎదుగుతారన్నారు. పాఠశాల స్థాయి నుంచి వృత్తి విద్య నేర్చుకోవడం ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్య ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, శంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.


బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు, ఆల్ మైనారిటీ ఉద్యోగుల సంక్షేమ సంఘం (ఆల్ మేవా) నాయకులు వేరువేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ, కార్యదర్శి రామునాయక్, రాష్ట్ర కార్యదర్శి హనుమంతు, నగర అధ్యక్షుడు రఫీ, ఆల్‌మేవా నాయకులు షేక్షా, ఫక్రుద్దీన్, అన్వర్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష సూపరింటెండెంట్ నియామకం



బాధ్యతలు తీసుకుంటున్న పెద్దయ్య

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష కార్యాలయంలో సూపరింటెండెంట్‌ను ఎట్టకేలకు నియమించారు. సెక్టోరియల్ అధికారుల పోస్టులతో పాటు కీలకమైన సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 23న 'అటకెక్కిన విద్యాభివృద్ధి' శీర్షికతో 'సాక్షి'లో కథనం వెలువడింది. స్పందించిన అధికారులు శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పెద్దయ్యకు పదోన్నతి కల్పించి ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ పోస్టుకు బదిలీ చేశారు. దీంతో ఆయన విధుల్లో చేరారు.

సాక్షి ఎఫెక్ట్..

జగమేలు జగజ్జననికి జేజేలు



కొత్తూరు అమ్మవారి శాలలో పద్మనిధి కుబేర లక్ష్మి అలంకారం



శారదా శంకర మఠంలో మోహినీ అలంకారం



రెండోరోడ్డులో జ్ఞానపీఠ అలంకారం



పాతూరు అమ్మవారి శాలలో కొలువుదీరిన అమ్మవారు



సిండికేట్‌నగర్ వద్ద మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు

అనంతపురం కల్చరల్: జగమేలే జగజ్జననికి భక్తజనం జేజేలు పలికింది. నగరంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. రామనగర్‌లోని కోదండరామాలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరిగా, బెంగళూరు రోడ్డులోని ఆశ్రమంలో అనంతేశ్వరి ఆలయంలో అమ్మవారు లలితాదేవిగా, శంకరమఠంలో పరమేశ్వరి మోహిని అలంకారంలో, శివకోటిలో లలితా శివకామేశ్వరిగా, హెచ్చెల్సీ కాలనీలో శ్రీనసనకోట ముత్యాలమ్మ తల్లి శ్రీమహాలక్ష్మిగా పూజలందుకున్నారు. రెండో రోడ్డులో వివిధ హోమాలు నిర్వహించారు. పాతూరు రేణుకా యల్లమ్మ తల్లి ఆలయం, కొల్హాపూర్ మహాలక్ష్మీదేవి ఆలయం, సుభాష్‌రోడ్డులోని అర్బన్ బ్యాంకు సమీపంలో దుర్గామాత, పాతూరు నిమిషాంబదేవి ఆలయం తదితర చోట్ల అమ్మవారు విశేష అలంకారాలలో దర్శనమిచ్చారు. ముఖ్యంగా భారీ విద్యుద్దీపకాంతులీనుతున్న కొత్తూరు, పాతూరు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తపోవనం వేదమాత గాయత్రి ఆలయంలో గజలక్ష్మి అలంకారంలో ఉన్న అమ్మవారిని భక్తులు బారులు తీరి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో శాస్త్రీయ నృత్యాలతో నీరాజనాలర్పించారు.

మహాలక్ష్మీదేవిగా దుర్గామాత

రాప్తాడు/ఆత్మకూరు: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా వైభవంగా సాగుతున్నాయి. ఐదోరోజు శుక్రవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాప్తాడు మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌లోని గౌరీ ప్రసన్నేశ్వర స్వామి దేవాలయంలో దుర్గామాత, అత్మకూరు మండలంలోని వద్దుపల్లిలో సుంకులమ్మ మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మహాలక్ష్మీ అమ్మవారి దర్శనం

రాప్తాడురూరల్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ సిండికేట్‌నగర్ మసీదు వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం శుక్రవారం 'మహాలక్ష్మీ' అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. పంచాయతీ పరిధిలోని భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

చిరంజీవిని దూషించినా స్పందించరా?

అనంతపురం కార్పొరేషన్: తన అన్న, కేంద్ర మాజీ మంత్రి, సినీ పరిశ్రమ పెద్ద అయిన చిరంజీవిపై అసెంబ్లీ సాక్షిగా హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ దూషించినా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని మేయర్ వసీం అన్నారు. చిత్రపరిశ్రమ సమస్యలపై నాటి సీఎం వైఎస్ జగన్‌ను చిరంజీవి కలిసి.. చర్చలకు ఒప్పించారని కామినేని శ్రీనివాస్ ప్రస్తావించినపుడు బాలయ్య జోక్యం చేసుకుని అవాకులు చెవాకులు పేలారన్నారు. సొంత అన్నను తిడుతున్నా పవన్ కల్యాణ్ మౌనంగా ఉండటం విమర్శలకు తావిస్తోందన్నారు.

డిప్యూటీ సీఎం ప్రేక్షకపాత్ర

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీ వేదికగా మెగాస్టార్ చిరంజీవిని ఉద్దేశించి అభ్యంతరకరమైన మాటలు మాట్లాడటాన్ని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ఖండించారు. అవమానకర రీతిలో దూషిస్తున్నా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రేక్షకపాత్ర పోషించడం సరికాదన్నారు. బాలకృష్ణ వ్యాఖ్యలను ఉప సభాపతి ఖండించి, రికార్డులోంచి తొలగించాల్సి ఉందన్నారు. కానీ అటువంటి నిర్ణయం తీసుకోకపోవడం కూటమి ప్రభుత్వ దుశ్చర్యలకు అద్దం పడుతోందన్నారు.

సమష్టి కృషితోనే వికసిత్ భారత్

అనంతపురం: సమష్టి కృషి, సమష్టి నాయకత్వంతోనే వికసిత్ భారత్ సాధ్యమని జాతీయ యువ పురస్కార గ్రహీత బిసాతి భరత్ అన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.షీలారెడ్డి అధ్యక్షతన శుక్రవారం 'వికసిత భారత్ యువ కనెక్ట్ ' అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి బిసాతి భరత్ మాట్లాడుతూ విద్యార్థుల సామాజికాభివృద్ధి, పౌర బాధ్యతలో తమ సామర్థ్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పోషకాహారంతో ఆరోగ్యమస్తు

అనంతపురం: 'ఆధునిక కాలంలో మారుతున్న జీవనశైలి ఎన్నో రకాల జబ్బులకు కారణమవుతోంది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అన్ని రకాల వయస్సుల వారు జబ్బులకు గురవుతున్నారు. పోషకాహార లేమితో అనేక రకాల రుగ్మతలు తలెత్తుతున్నాయ'ని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఉమెన్స్ స్టడీస్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఆహార వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ వీసీతో పాటు విశిష్ట అతిథులుగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ జి.హేమలత హాజరై మాట్లాడారు. రోజూ పోషకాహారం తీసుకోవడంతో ఆరోగ్యానికి మేలు కలుగుతుందన్నారు. పిల్లలు, పెద్దలు పోషక విలువలు గల పదార్థాలు తీసుకోవాలని తద్వారా రుగ్మతలు అరికట్టవచ్చని పేర్కొన్నారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ , ఉమెన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ శోభాలత అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి

అనంతపురం: ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని జేఎన్‌టీయూ అనంతపురం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు విద్యార్థులకు సూచించారు. వర్సిటీ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం అన్ని విభాగాలు సంయుక్తంగా ఫ్రెషర్స్‌డే నిర్వహించాయి. వీసీ ముఖ్య అతిథిగా మాట్లాడారు. 79 ఏళ్ల ఘన చరిత్ర గల జేఎన్‌టీయూ(అనంతపురం)లో చదవడం గర్వకారణంగా భావించాలన్నారు. విద్యార్థి దశలో ఇంజినీరింగ్ కోర్సు చాలా ముఖ్యమన్నారు. నాలుగేళ్లు కష్టపడి చదివితే ఉన్నత స్థాయిలో ఉండొచ్చునన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వసుంధర, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలి

అనంతపురం అర్బన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొరల గుండెల్లో వణుకు పుట్టించిన విప్లవనారి చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజల సమస్యలపై ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఐలమ్మ 130వ జయంతి నిర్వహించారు. నారాయణస్వామితో పాటు చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగప్ప, సీవీ హరికృష్ణ, సమాఖ్య, సీపీఐ నాయకులు రాజేష్, రమణయ్య, కృష్ణుడు, రఘు, గోవిందరాజులు, భూషణ, నాగరాజు, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, నరసింహులు, మారుతి, వీరనారాయణప్ప, తదితరులు పాల్గొన్నారు.


అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

అనంతపురం కార్పొరేషన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో ఆయన మాట్లాడారు. సమస్యను పరిష్కరించకపోయినా..పరిష్కరించినట్లు చూపితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమస్యలను పరిష్కరిస్తారన్న కొండంత ఆశతో ప్రజలు మన వద్దకు వస్తారన్నారు. అలాగే సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. సమావేశంలో ఎస్‌ఈ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ఆత్మకూరు: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా 'ఈ-క్రాప్'లో వివరాలు నమోదు చేయించుకోవాలని ఏడీఏ అల్తాఫ్ సూచించారు. శుక్రవారం మండలంలోని తోపుదుర్తి గ్రామంలో ఈ-క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు.

వధూవరులకు జగన్ ఆశీర్వాదం



వైఎస్ జగన్‌తో నూతన వధూవరులు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎన్వీ రమణ

రాప్తాడు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ నేతలు కలిశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎన్వీ రమణ, కుమారుడు నవీన్ కుమార్‌కు, మరూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అంకె ముత్యాలప్ప కుమార్తె అంకె ఉమా శ్రావణితో గత నెల 17వ తేదీ జరిగింది. దీంతో ఇరు కుటుంబాలు శుక్రవారం వైఎస్ జగన్‌ను కలవగా... ఆయన నూతన వధూవరులతో ఆశీర్వదించారు.

నేడు, రేపు సీఐటీయూ జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

అనంతపురం అర్బన్: సీఐటీయూ జిల్లా మహాసభలు శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు నాగమణితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అశోక్‌నగర్‌లోని ఆపిల్ గార్డెన్స్‌లో రెండు రోజుల పాటు జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. నేటి ఉదయం 11 గంటలకు ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి నగర పాలక సంస్థ కార్యాలయం వరకు కార్మిక ర్యాలీ నిర్వహిస్తామన్నారు. మహాసభకు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహమ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఉద్యోగులు, కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు, నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగుల పీఆర్‌సీ, డీఏ, కార్మికులకు సమానపనికి సమాన వేతనం, తదితర డిమాండ్‌లను మహాసభలో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మహాసభలకు కార్మికులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చిరువ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న వెంకటనారాయణ

అనంతపురం అర్బన్: చిరువ్యాపారులకు ప్రభుత్వం రుణాలు ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు వెంకటనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని రెండవ రోడ్డులో తోపుడు బండ్ల వ్యాపారుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటనారాయణతో పాటు సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడారు. ఉపాధి కరువై పేదలు జిల్లా నలుమూలల నుంచి నగరానికి వలసవచ్చి చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారి నుంచి అధికంగా సుంకం వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధన మేరకు సుంకం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, కదిరప్ప, మరియమ్మ, తోపుడు బండ్ల వ్యాపారుల సంఘం నాయకులు వినోద్, శీనా, రామాంజి, నాగభూషణం, సూరి, తిప్పేస్వామి, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

రాప్తాడు: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి సహకరించాలని, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి అధ్యక్షతన, ఎంపీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని, గాలి వీచినా, చినుకు పడినా కరెంట్ సరఫరా నిలిచిపోతోందని పలువురు సర్పంచులు ఫిర్యాదు చేశారు. అలాగే గోకులం బిల్లులు మంజూరయ్యేలా చూడాలని, కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు ఎంపీటీసీలు కోరారు. అనంతరం గత మూడు నెలల్లో అన్ని శాఖలలో జరిగిన ప్రగతి, ప్రతిపాదనలకు సంబంధించిన నివేదికలను ఆయా శాఖల అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ...రాజకీయాలకు అతీతంగా అర్హులకు పథకాలు వర్తింపజేయాలన్నారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నివారణకు వైద్య సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మన్నల వరలక్ష్మి, ఎంఈఓ మల్లికార్జున, ఏఓ కృష్ణచైతన్య, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన షేక్ బషీ

రాప్తాడు: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన వలస కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే.. రాప్తాడు మండలంలోని హంపాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 20వ తేదీన 33 కేవీ ఫిట్టింగ్ పనులు చేస్తున్న సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన షేక్ బషీ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అతన్ని తొలుత అనంతపురం సర్వజనాస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం అదే రోజు రాత్రి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజుల అనంతరం షేక్ బషీని గురువారం హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కాగా, విద్యుత్ అధికారుల తప్పిదం వల్లే కార్మికుడికి ప్రమాదం జరిగిందని అధికారుల విచారణలో తేలినా విద్యుత్ శాఖ అధికారులపై ఆ శాఖ ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మరోవైపు షేక్ బషీ మృతికి కారకులైన విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మన్నీల రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మండల సర్వ సభ్య సమావేశంలో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతి పత్రం ఇచ్చారు.

ఎంటీఎస్ టీచర్లను క్రమబద్ధీకరించండి

- కలెక్టరేట్ ఎదుట ఎంటీఎస్ టీచర్ల ధర్నా



ధర్నా చేస్తున్న ఎంటీఎస్ టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: పాతికేళ్ల సర్వీసు కోల్పోయిన డీఎస్సీ-98 ఎంటీఎస్ టీచర్లను తక్షణమే రెగ్యులర్ చేయాలంటూ ఎంటీఎస్ టీచర్లు డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ నెల 30 వరకూ నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని ఆందోళన కారులు పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ఏడాదిలో 12 నెలలు జీతం ఇవ్వాలని, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, పీఎఫ్, ఈహెచ్‌ఎస్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా, 1998 డీఎస్సీలో అర్హత సాధించినప్పటికీ అప్పటి ప్రభుత్వ నిర్వాకం కారణంగా ఉద్యోగాలు పొందలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు పాతికేళ్ల పాటు నానా ఇబ్బందులూ పడ్డామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందిం

నేత్రపర్వం.. శ్రీవారి బ్రహ్మోత్సవం



సర్వభూపాళ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు



ప్రత్యేక పూజలందుకున్న వెంకటేశ్వరస్వామి

అనంతపురం కల్చరల్: నగరంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. నగరంలోని ఆర్‌ఎఫ్‌రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం శ్రీవారు శ్రీదేవి, భూదేవి సమేతుడై సర్వభూపాళ వాహనంపై విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. నగరవీధుల్లో పల్లకీసేవ ముందు భక్తులు కోలాటం, భజనగీతాలతో హారతులు పట్టారు. అంతకుముందు ఆలయంలో విశేష అభిషేకాలు, అలంకార సేవలతో పాటు నవగ్రహ హోమం, దీక్షా హోమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు హరికిషోర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే రామనగర్‌లో, హౌసింగుబోర్డుల్లోని శ్రీ వేంకటేశ్వరాలయాలలో బ్రహ్మోత్సవ వేడుకలు కమనీయంగా జరిగాయి.

భక్తిశ్రద్ధలతో ధన్వంతరీ హోమం

అనంతపురం కల్చరల్: నగరంలోని పాతూరు ఉత్తరాధి మఠం (మూల ఆంజనేయస్వామి ఆలయం)లో శుక్రవారం ఉదయం ధన్వంతరీ హోమం భక్తిశ్రద్ధలతో జరిగింది. కేదార్‌నాథ్ గౌడ్ అనే భక్తుడు మూలాంజనేయస్వామికి బంగారు ముఖ కవచం చేయించి రెండేళ్లు పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకుని లోక కల్యాణం కోసం మఠంలో శాస్త్రోక్తంగా ధన్వంతరీ హోమం జరిపించారు. ప్రధాన అర్చకులు వినోదాచార్ వేదశాస్త్ర సహితంగా సాగిన హోమంలో బంగారు కవచ దాతలు చిత్రా ఓబన్న గౌడ్, కేదార్‌నాథ్ గౌడ్ తదితరులు ఆత్మీయ అతిథులుగా పాల్గొని తీర్థప్రసాదాలందుకున్నారు. సమాజానికి ఆయురారోగ్యాలనందించే ధన్వంతరీ హోమం నిర్వహణ క్రమం తప్పకుండా సాగాలని మఠం ప్రతినిధులు అంతకు ముందు సాగిన ఆధ్యాత్మిక ప్రసంగంలో పేర్కొన్నారు.

విద్యార్థి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థి మణికంఠ మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీలో కనీస వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్లే మణికంఠ మృతి చెందాడని పేర్కొన్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలను సీరియస్‌గా తీసుకోవాలని, యూనివర్సిటీ డిస్పెన్సరీలో 24 గంటల వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థికి జరిగిన అన్యాయం పక్షాన నిలబడి ఆందోళన చేస్తున్న విద్యార్థులకు అండగా ఉండాల్సిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.

హిందీ భాషాభివృద్ధికి సహకరించండి



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న హిందీ ప్రచారసభ ప్రతినిధులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో హిందీ భాషాభివృద్ధికి సహకరించాలని హిందీ ప్రచారసభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును గైబువల్లి సారథ్యంలో ప్రతినిధుల బృందం విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేసింది. హిందీ నేర్చుకుంటే దేశంలో ఎక్కడైనా భాష సమస్య లేకుండా జీవనం సాగించవచ్చని పేర్కొన్నారు. హిందీ భాష వల్ల దేశ, విదేశాల్లోనూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనూ హిందీ భాష అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఏపీ సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ అకౌంటబిలిటీ, ట్రాన్స్‌పరెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ జి.శ్రీకాంత్, ఎడుక్‌లో వ్యవస్థాపక సీఈఓ శ్రీనివాస మద్దలాపురం, ఏపీ హిందీ ప్రచారసభ సభ్యులు శివ, ఇంతియాజ్ పాల్గొన్నారు.

స్త్రీలను పూజించడం సనాతన ఆచారం

అనంతపురం కల్చరల్: స్త్రీలను గౌరవిస్తూ.. పూజించడమనేది సనాతన కాలం నుంచి వస్తున్న ఆచారమని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య అన్నారు. శుక్రవారం సాయిట్రస్టు ఆధ్వర్యంలో తపోవనంలోని శ్రీశివశక్తిసాయి దేవాలయంలో నిర్వహించిన కుమారి పూజల్లో వాసంతి సాహిత్య, మాజీ మేయర్ స్వరూప ఆత్మీయ అతిథులుగా పాల్గొని మాట్లాడారు. చెడు మీద మంచి గెలవడమే దసరా వేడుకల విశిష్టత అని, ముఖ్యంగా మహిళలకు పెద్ద పీట వేసే కుమారి పూజలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతకు ముందు అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలకు, చిన్నారులకు స్వయంగా వారే పసుపు పూసి, పారాణి పెట్టి పూజావిధానం ప్రారంభించారు. అదేవిధంగా విజయదుర్గ అమ్మవారికి జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలందుకున్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు విజయ్‌కుమార్, రాఘవేంద్ర, దేవేంద్ర, మాతృమండలి సభ్యులు మీనా, లక్ష్మీదేవి, డాక్టర్ జ్యోతిసాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాషువా జయంతి

అనంతపురం కల్చరల్: మహాకవి గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలు శనివారం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఆర్ట్స్ కాలేజీ సమీపంలోని గుర్రం జాషువా విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, జాషువా అభిమానులు పుష్పమాలలతో నివాళులర్పిస్తారు. జాషువా జయంతి వేడుకల్లో ప్రముఖ కవులు, రచయితలు, విద్యావేత్తలు హాజరవుతారని సాహిత్యపీఠం ప్రతినిధులు డాక్టర్ నానీల నాగేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు.

- శనివారం ఉదయం 10.30 గంటలకు ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ప్రాంగణంలోని వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాషువా జయంతి వేడుకలు జరుగుతాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎస్కేయూ మాజీ వీసీ ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో డాక్టర్ కల్లూరి ఆనందరావు, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి ప్రసంగిస్తారని సాహితీ అభిమానులు విచ్చేయాలని కోరారు.

'బాలకృష్ణకు మతి భ్రమించింది'

అనంతపురం టవర్‌క్లాక్: బాలకృష్ణ మతి భ్రమించి మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్ విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా, సినీహీరోగా హుందాగా ఉండాల్సిన బాలకృష్ణ దిగజారి ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. చిరంజీవి, జగన్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు సరైనవి కావన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని, లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు వనమాల నాగరాజు, భాస్కర్ రెడ్డి, మల్లికార్జున నాయక్ తదితరులు పాల్గొన్నారు.